

విందుకు ముందు ప్రార్థన చేస్తున్న ముస్లింలు

● మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

నగరంలో ప్రసిద్ధిగాంచిన భోలక్‌పూర్ బడీమసీదులో ఇఫ్తార్ విందు నిర్వహించారు. బడీమసీదు ముత్తవల్లి నజీర్ అలీ హాజరై సామూహిక ప్రార్థనలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పవిత్ర రంజాన్ మాసంలో రోజూ ఇఫ్తార్ నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహిన్, బాబర్, అల్లాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.
ముషీరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి)



రాంనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మేడిబాయి బస్తీలోని పాతీమామసీదు కమిటీ అధ్యక్షుడు జహంగీర్, మహ్మద్ ఖదీర్‌ల ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ నిర్వహించారు. ఎమ్మెల్యే గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ హాజరయ్యారు. ఈవిందు మతసామరస్యానికి ప్రతీక అని గోపాల్ అన్నారు.

● కొవ్వొత్తుల ర్యాలీ

ముషీరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) క్రైస్తవ బోధకుడు పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్‌ను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు, క్రైస్తవ సంఘం నేతలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లేమియల్, పాస్టర్లు డానియల్, రాంచందర్, విజయ్‌కుమార్, నాయకులు సురేందర్, విజయ్ పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు



డిప్యూటీ సీఎం భట్టిని సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘాల నేతలు రమణారావు, సుధాకర్, సుశీల్‌కుమార్ తదితరులు

డిప్యూటీ సీఎంకు సన్మానం

నల్లకుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆదివారం బ్రాహ్మణ సంఘాల సభ్యులు సన్మానించారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు బడ్జెట్‌లో రూ. 100 కోట్ల కేటాయించిన నేపథ్యంలో మర్యాదపూర్వకంగా కలిసి వారు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ అఫీషియల్, ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.వి.సుశీల్‌కుమార్, జనరల్ సెక్రటరీ వింజమూరి సుధాకర్, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు పోచంపల్లి రమణారావులు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, నాయకులు హెచ్.వి.రాంప్రసాద్, పి.వి.రామచంద్రరావు, సీతారామయ్య, రాంబాబు, శ్రీనివాస్‌శర్మ, బాచంపల్లి సంతోకుమార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

రాంనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రజలకు హామీనిచ్చారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని చెంచుబస్తీలో తన సొంత నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి కాలేరు పద్మ, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గెల్వయ్య, చంద్రమోహన్, శ్రీరాములుముదిరాజ్, రమేశ్, మిరియాల రవీందర్, సునీల్, శ్రీహరి, నరహరి, చెంచుబస్తీ అధ్యక్షుడు హనుమంతు, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

వేడుకలకు బందోబస్తు కల్పించాలని వినతి

రాంనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 6న జరిగే శ్రీరామనవమి, ఇదే నెల 12న నిర్వహించే శ్రీహనుమాన్ జయంతి వేడుకల నేపథ్యంలో బందోబస్తు కల్పించాలని శ్రీహనుమాన్ ఉత్సవ సమితి సభ్యులు కోరారు. బుధవారం సీఐ రాంబాబుకు వినతిప్రతం అందించారు. శ్రీహనుమాన్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, ప్రతినిధులు గడ్డం నవీన్, ఉదయ్ కుమార్, రాంరెడ్డి, నవీన్‌గౌడ్, మద్దూరి శివాజీ, అరుణ్, రాకేష్, సత్యనారాయణ, రాజ్‌కుమార్‌లు మాట్లాడారు. ఏప్రిల్ 12న జరిగే శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా రాంనగర్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం నుంచి హరినగర్‌లోని పార్కు వరకు భారీ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు సీఐకి తెలిపారు.



పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

పైప్‌లైన్‌లకు మరమ్మతులు

బర్కత్‌పుర, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో యుద్ధప్రాతిపదికన మంచినీటి పైప్‌లైన్‌లకు మరమ్మతు పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. బుధవారం డివిజన్‌లోని లింగంపల్లి చౌరస్తాలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల వల్ల మంచినీటి పైప్‌లైన్ పగిలిపోయి నీటి సరఫరా నిలిచిపోవడంతో మరమ్మతులు చేపట్టి పూర్తి చేశారు. కొన్ని ప్రాంతాలలో సీసీ రోడ్డు నిర్మాణం వల్ల మంచినీటి పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడ్డాయని, దీంతో నీటి సరఫరా తగ్గిపోయి స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జలమండలి అధికారులతో మాట్లాడి ఈ పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు అరవింద్, వాసు, భీమ్‌రాజ్, రవియాదవ్, సూరి, ఓంప్రకాష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

అంబర్‌పేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న ఇళ్లల్లో పగటిపూట చోరీలకు పాల్పడుతున్న దొంగను అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ మల్లీశ్వరి తెలిపిన వివరాల ప్రకారం. రామంతాపూర్ కేసీఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న తాళ్ల రాఘవేందర్ (26) గత సంవత్సరం జూలై 5 న ప్రేమ్‌నగర్‌లోని ఉపేందర్‌రెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. ఈ నెల 21వ తేదీ పటేల్‌నగర్‌లోని చింతల విక్రమ్ ఇంట్లో నగదు తస్కరించారు. పోలీసులు సీసీ కెమెరాలు ఆధారంగా విచారించారు. దీంతో దొంగతనం చేసినట్లుగా నిర్ధారణైంది. బుధవారం నిందితుడిని కేసీఆర్‌నగర్‌లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం స్వాధీనం

బర్కత్‌పుర, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాచిగూడ శ్రీ శ్యామ్‌బాబా మందిరం పక్కన ఫుట్‌పాత్‌పై సుమారు 70 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని మహిళ బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో చనిపోయి విగతజీవిగా పడి ఉంది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. సుభాష్ తెలిపారు.

సాంస్కృతిక శాఖకు బడ్జెట్ కేటాయింపులేవి?

రాంనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ కళాకారుల సంక్షేమం కోసం సాంస్కృతిక శాఖకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం అన్యాయం అని తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహులు పేర్కొన్నారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌వి, పీఎన్ఎల్ సంస్థల ఆధ్వర్యంలో తెలంగాణ కళాకారుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఆటపాటలతో కళాకారులు ఉద్యమానికి ఊపిరిపోశారని అన్నారు. అలాంటి కళాకారులను ప్రభుత్వాలు మోసం చేశాయని ఆరోపించారు. కార్యక్రమంలో కళాకారుల జేఏసీ కన్వీనర్ మురళీధర్‌దేశ్‌పాండే , నాయకులు రాకేష్, శ్రవణ్, శ్రీనివాస్, యాదగిరి, ఆనంద్, ఆశన్న, నరేష్, రాజయ్య, భాస్కర్, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

వేసవి ఆరంభంలోనే నీటి కష్టాలు

వేసవి ప్రారంభంలోనే ముషీరాబాద్ నియోజకవర్గ వాసులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. దీంతో నీటి, గృహ అవసరాల కోసం వాటర్ ట్యాంకర్లను బుక్ చేసుకుంటున్నారు. చాలా ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటగా, బోర్లు ఎండిపోతున్నాయి. దీంతో ట్యాంకర్లకు బాగా డిమాండ్ పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా బుకింగ్ సంఖ్య పెరుగుతుందని జలమండలి ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

వాటర్ ట్యాంకర్లకు డిమాండ్

- అడుగంటిన భూగర్భజలాలు.. ఎండిపోతున్న బోర్లు
- చేసేది లేక ట్యాంకర్లు బుక్ చేసుకుంటున్న ప్రజలు
- 24 గంటల్లో 80 ట్యాంకర్ల సరఫరా
- భవన యజమానులకు ఇంకుడుగుంత తప్పనిసరి అంటున్న అధికారులు

ముషీరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ రిజర్వాయర్ జలమండలి పరిధిలో 24 గంటల పాటు 80 ట్యాంకర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. రాంనగర్, లలితానగర్, రిసాలాగడ్డా, తదితర ప్రాంతాల ప్రజలు వాటర్‌ట్యాంక్ కోసం అధికంగా బుకింగ్ చేసుకుంటున్నారు. రిజర్వాయర్ పరిధిలో ఒక ఫ్రీ ట్యాంకర్, ఐదు పేమెంట్ వాటర్ ట్యాంకర్లు ఉన్నాయి. మొత్తం ఆరు ట్యాంకర్ల ద్వారా ముషీరాబాద్ ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నారు. రిజర్వాయర్‌కు రోజూ కృష్ణాజలాల నుంచి 7ఎంజీడీల నీటిసరఫరా జరుగుతున్నప్పటికీ వాటర్‌ట్యాంకర్ల డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. రిజర్వాయర్ పరిధిలోని మూడు సెక్షన్ల పరిధిలో ఫిబ్రవరి మాసం వరకు ప్రతిరోజూ 30వాటర్ ట్యాంక్‌ల నీటిని సరఫరా చేయగా మార్చి మొదటి వారం నుంచి 70 నుంచి 80కి పైగా ట్యాంకర్ల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఎండిన బోర్లు...

రిజర్వాయర్ పరిధిలో భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బోర్ల నుంచి వాటర్ రావడం లేదు. దీంతో వాటర్ ట్యాంకర్లకు భారీగా డిమాండ్ పెరిగింది. మూడు వందల స్క్వేర్ మీటర్ల పైబడి భవనం ఉంటే తప్పనిసరిగా ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోవాలని జలమండలి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కానీ వారి ఆదేశాలు స్థానికులెవరూ పట్టించుకోలేదు. ఫలితంగా వేసవిలో నీటిసమస్య ఏర్పడింది. రాబోయే రోజుల్లో వాటర్ ట్యాంకర్లకు మరింత డిమాండ్ పెరగనుంది.



జలమండలి వాటర్ ట్యాంక్

- 155313 నంబర్‌కు కాల్ చేసి వాటర్ ట్యాంకర్ బుక్ చేసుకోవాలి. డొమెస్టిక్ ధర రూ.500, కమర్షియల్ ధర రూ. 850 చెల్లిస్తే వాహనం పంపిస్తామని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది, ఈ యేడు గానీ ధరల్లో ఎలాంటి మార్పు లేదన్నారు.



ముషీరాబాద్ జలమండలి కార్యాలయం

సకాలంలో నీటి సరఫరా..

వాటర్‌ట్యాంకర్ కోసం బుకింగ్ చేసుకున్న ప్రతీఒక్కరికి సకాలంలో నీటిని సరఫరా చేస్తున్నాం. రోజూ 80కి పైగా స్లాట్స్ బుకింగ్స్ అవుతున్నాయి. స్లాట్ బుకింగ్ ప్రకారం రెండు ఫిల్లింగ్ పాయింట్ల ద్వారా నీటిని అందిస్తున్నాం. ఇంకుడు గుంతల ఏర్పాటుపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.
- మోహన్‌రాజ్, ముషీరాబాద్ జలమండలి డీజీఎం





గరికిపాటిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న నాట్యమండలి సభ్యులు

తెలుగు భాషకు పద్యం సౌందర్యం

● ప్రముఖ ప్రవచనకర్త గరికిపాటి

చిక్కడపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు పద్యం సౌందర్యం అని ప్రముఖ ప్రవచనకర్త పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు అన్నారు. తెలుగు పద్యనాటకంలో పద్యం సందేశం నీతితో కూడి ఉంటాయని చెప్పారు. శ్రీరామకృష్ణా నాట్యమండలి ఐదు దశాబ్దాల వేడుకలు ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం త్యాగరాయగానసభలో నిర్వహించారు. ఈసందర్భంగా నవ జీవితంలో నాటక పద్యం అంశంపై గరికిపాటి నరసింహారావు విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. ప్రస్తుతం ఐటీ కంపెనీలు యువతను మరయంత్రాలుగా మార్చాయని చెప్పారు. కొడుకు బెట్టింగ్‌లో లక్షలు నష్టపోతే తండ్రి తాను దాచుకున్న డబ్బును ఇచ్చిన వార్తను ఉదహరిస్తూ చింతామణి నాటకంలోని పద్యాలను చెప్పి తండ్రి ప్రేమ వివరించారు. రంగస్థల కళాకారుడు సీవీఎన్ కృష్ణ ఆధునిక నాటక వికాసం అంశంపై ప్రసంగం చేశారు. నిర్మలా నృత్యనికేతన్ విద్యార్థులు కూచిపూడి నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు. మాస్టర్ సాయి శంకర్ భారతీయుడు ఏకపాత్రాభినయం చేశారు. తొలుత శరత్ కౌశిక్ వేద పఠనం చేశారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి, రంగస్థల ప్రముఖుడు డా. జొన్నలగడ్డ జగన్‌మోహన్ రావు స్వాగతం పలికిన సభలో శ్రవణ్‌కుమార్, మల్లెల సాయి శివరామ్, ఆదిలక్ష్మి, కల్యాణి, లక్ష్మీకాంతశర్మ, జంగయ్యగౌడ్ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నైనాదేవికి ఉగాది పురస్కారం ప్రదానం

రాంనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవకురాలు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆదర్శ్ కోశాధికారి నైనాదేవి మహిళారత్న ఉగాది పురస్కారం అందుకున్నారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఉగాది పండుగ సందర్భంగా సర్వేజన సుఖినోభవంతి సంస్థ ఆధ్వర్యంలో జస్టిస్ బి.చంద్రకుమార్, ఆ సంస్థ అధ్యక్షుడు సూర్యనారాయణ చేతుల మీదుగా పురస్కారం ప్రదానం జరిగింది. అనంత రం సత్కారగ్రహీత మాట్లాడుతూ తాను చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేశారన్నారు. డాక్టర్ కె.మహేందర్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, లక్ష్మీసోమయాజులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 1.75 లక్షలు

చిక్కడపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి ఆలయం హుండీ ఆదాయం లక్ష 75 వేల 462 రూపాయలు వచ్చింది. బుధవారం ఆలయం సిబ్బంది, భక్తులు హుండీని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ ఛైర్మన్ జానకి సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం, ఆలయ కమిటీ సభ్యులు ఎం. గణేష్ పర్యవేక్షణలో లెక్కించారు.

టీఎస్‌పీఏ నగర అధ్యక్షుడిగా శ్రీశైలం యాదవ్

ముషీరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టూడెంట్స్, పేరెంట్స్ అఫిలేషన్ (టీఎస్‌పీఏ) నగర అధ్యక్షుడిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీశైలం యాదవ్ నియమితులయ్యారు. ఆ మేరకు గాంధీనగర్‌లోని టీఎస్‌పీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో మండల స్థాయి నుంచి నగరం వరకు పూర్తి స్థాయ కమిటీలు ఏర్పాటు చేసి విద్యా సంస్థల్లో తప్పనిసరి మౌలిక సదుపాయాలు ఉండేలా తమ వంతు కృషిచేస్తామన్నారు.



శ్రీశైలం యాదవ్



మాట్లాడుతున్న క్రైస్తవ సంఘాల నేతలు బిషప్ భాస్కర్, సుజీవన్, సుధీర్‌కుమార్ తదితరులు

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

● క్రైస్తవ సంఘాల నేతలు

నల్లకుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్రైస్తవ పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని పలు క్రైస్తవ సంఘాల నేతలు, పాస్టర్లు ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ మృతి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని క్రైస్తవులకు తీరని లోటని వారన్నారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైస్తవ సంఘాల నేతలు బిషప్ భాస్కర్, సుజీవన్, సుధీర్‌కుమార్‌లు మాట్లాడారు. ఏపీ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారు కొంతమూరు వద్ద రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ మృతి చెందినట్లు పోలీసులు ప్రకటించారన్నారు. ఆయన మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. ప్రవీణ్ మృతదేహానికి సంబంధించిన పోస్టుమార్టం రిపోర్టును వెంటనే విడుదల చేయడంతో పాటు ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మంత్రివర్గంలో మాదిగలకు అవకాశమివ్వాలి

మాదిగ జేఏసీ ముషీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు

కవాడిగూడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని మాదిగ జేఏసీ ముషీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్ కోరారు. కవాడిగూడలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో మాదిగలు అత్యంత వెనుకబడి ఉన్నారని, వారి అభ్యున్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలయాపన చేయకుండా కాంగ్రెస్ అధిష్ఠానం ఆలోచించి మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని చంద్రశేఖర్ కోరారు.



మాట్లాడుతున్న వీఆర్ఏ జేఏసీ కన్వీనర్ రాములు

వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యం ఇవ్వాలి

కవాడిగూడ, మార్చి 26 ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా అమలు చేయబోతున్న గ్రామపరిపాలన అధికారి (జీపీవో) పోస్టులలో వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యం కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బుధవారం వీఆర్ఏ వారసులు మహాధర్నా నిర్వహించారు. ధర్నాకు జేఏసీ కన్వీనర్ వంగూరి రాములు, మాజీఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి స్కైలాబ్ బాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సోమశేఖర్, ఏఐటీయూసీ నాయకులు బాలరాజులు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. జీవో 81, 85 ప్రకారం బీఆర్ఎస్ ప్రభుత్వం 16,768 ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తు చేశారు. మిగిలిన 3,797 మంది వీఆర్ఏ వారసులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ ఉత్తర్వులివ్వకుండా కాలయాపన చేయడం సరికాదని అన్నారు. ఇందిరమ్మరాజ్యం అని చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే వీఆర్ఏ వారసులకు గ్రామపరిపాలన అధికారి నియామకాల్లో ఉద్యోగాలిచ్చి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.



అన్నమాచార్య విగ్రహం వద్ద భక్తిగీతాలు ఆలపిస్తున్న డాక్టర్ శోభరాజు

భక్తిశ్రద్ధలతో మహానగర సంకీర్తన

కవాడిగూడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య 522వ ఆరాధన సందర్భంగా అన్నమాచార్య భావనావాహిని సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ట్యాంక్‌బండ్‌పై భక్తి శ్రద్ధలతో మహానగర సంకీర్తన నిర్వహించారు. తెల్లవారుజామున చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో అన్నమాచార్య భావనావాహిని వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ డాక్టర్ శోభరాజు, వారి శిష్యులు వెంకటేశ్వరస్వామి వేషాధారణలో సందీప్, అన్నమయ్య వేషాధారణలో అభిరామ్‌లు పూజలు నిర్వహించారు. అనంతరం దేవతామూర్తుల చిత్రపటాలతో చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి ట్యాంక్‌బండ్ పై ఉన్న అన్నమాచార్య విగ్రహం వరకు మహానగర సంకీర్తన ర్యాలీగా చేరుకున్నారు. మహానగర సంకీర్తనను పురస్కరించుకొని గంటపాటు వెంకటేశ్వరస్వామి... పాటలు ఆలపించారు. కార్యక్రమంలో పండిట్ కాశీనాథ్ మిశ్రా మాట్లాడుతూ మాధవ నామమే శరణం అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పండిట్ కాశీనాథ్ మిశ్రా, శ్రీరామయోగిజీలను పద్మశ్రీ డాక్టర్ శోభరాజు మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అన్నమాచార్య భావనావాహిని మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎస్ నందకుమార్, ఛైర్మన్ వీపీ రాజ్, వెంకటేశ్వరస్వామి, అన్నమాచార్య భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీ మరింత బలోపేతం

● బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

ముషీరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముషీరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేలా పార్టీ శ్రేణులు అంకిత భావంతో పనిచేయాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్ చేస్తున్న కృషిని అభినందిస్తూ సన్మానించారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... బూత్‌స్థాయిలో బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు ఆశయాలను ప్రజలకు తెలియజేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. శివ ముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి, పి. శ్రీధర్‌చారి, డివిజన్ నాయకులు వెంకటేష్, బల్వంత్, సత్తనారాయణ బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువకుడిపై అకారణంగా దాడి.. ఇద్దరి అరెస్టు

రాంనగర్ ఆంధ్రజ్యోతి మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఓ యువకునిపై అకారణంగా దాడిచేసిన ఇద్దరిపై ముషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి బుధవారం అరెస్టు చేశారు. బెల్లంపల్లికి చెందిన యువకుడు విద్యానగర్లోని ఓ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. షాపింగ్ కోసం రాంనగర్‌కు వచ్చిన తెలిసిన యువతితో మాట్లాడుతుండగా.. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి అకారణంగా చేయి చేసుకొని వెళ్లిపోయారు. దాంతో బాధితుడు డయల్-100కు ఫోన్ చేశాడు ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు యువకుడిని ఫిర్యాదు మేరకు సీసీటీవీల ద్వారా ఇద్దరు నిందితులను గుర్తించారు. యువకుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపారు.

ఓటీఎస్‌కు ఇక ఐదు రోజులే!

- ఆస్తి పన్ను రాయితీకి ఆఖరి చాన్స్
- 30, 31వ తేదీల్లో .. ఉగాది, రంజాన్ సెలవులు
- నెలాఖరుతో ముగియనున్న పథకం
- ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో రూ. 5.50 కోట్లు బకాయిలు

రాంనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిల్ అధికారులకు కమిషనర్ ఇచ్చిన ఆస్తి పన్ను టాక్స్ టార్గెట్ చేరుకోవడానికి కేవలం ఐదు రోజులు మాత్రమే ఉంది. అయిదు రోజుల్లో 30,31వ తేదీలలో ఉగాది, రంజాన్ పండుగలు రావడంతో మరో మూడు రోజుల్లోనే టార్గెట్ చేరుకోవడం సవాల్‌గా మారింది. ముషీరాబాద్ సర్కిల్‌కు 40 కోట్ల టార్గెట్ చేయాల్సి ఉండగా బుధవారం నాటికి 34.5 కోట్లు వసూలు చేశారు. మిగిలిన 5.50 కోట్ల రూపాయలను ఈ నెల 31 వరకు వసూలు చేయాల్సి ఉంది. ఈ టార్గెట్‌కు చేరుకోవడానికి ముషీరాబాద్ డీఎంసీ రామానుజులరెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్రలు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఆస్తి పన్ను బకాయిదారుల నుంచి పన్ను వసూలు చేసే కార్యక్రమంలోనిమగ్నమయ్యారు.

అంబర్‌పేట సర్కిల్ పరిధిలో...

జీహెచ్ఎంసీ కమిషనర్ రూ. 58 కోట్ల ఆస్తి పన్ను టార్గెట్ విధించారు. బుధవారం నాటికి రూ. 48 కోట్లు వసూలు చేశారు. మిగిలిన రూ. 10 కోట్ల బకాయిల టార్గెట్‌ను ఈనెల 31వ తేదీ వరకు వసూలు చేయడమే లక్ష్యంగా డీఎంసీ మారుతిదివాకర్‌ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఏఎంసీలు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.



జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం

స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ పథకం ఈనెల 31వ తేదీతో ముగుస్తున్నది. దీంతో బకాయిదారులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ ద్వారా వడ్డీపై 90 శాతం రాయితీ పొందాలంటే బకాయిలు వెంటనే చెల్లించి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎవరైతే అధిక మొత్తంలో బకాయిలు ఉన్నారో వారి ఆస్తులను సీజ్ చేస్తాం.
- రామానుజులరెడ్డి, ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ

